క్లుప్తంగా

పోలింగ్ స్టేషన్‌ల పరిశీలన



గూటాలలో పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎం.ఝాన్సీరాణి

పోలవరం రూరల్: మండలంలో పోలింగ్ స్టేషన్‌లను రేషనలైజేషన్ కార్యక్రమంలో భాగంగా జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎం.ఝాన్సీరాణి బుధవారం పరిశీలించారు. గూటాల, కొత్తపట్టిసీమ గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్‌లను ఆమె పరిశీలించి ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవసరమైన అన్ని వసతులు ఉన్నాయా లేదా అనే విషయాలను తెలుసుకున్నారు. భవనాల పరిస్థితి ఎలా ఉంది, అవసరమైతే భవనాలను మార్పు చేసేందుకు కూడా ఆలోచన చేయాలని సూచించారు. వృద్ధులు, వికలాంగులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ర్యాంపులు ఎలా ఉన్నాయనేది పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ బి.సుమతి ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం



ఉపాధ్యాయుడు అంగులూరి సర్వేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

కామవరపుకోట: ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న తడికలపూడి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంగులూరి సర్వేశ్వరరావు దంపతులను బుధవారం జెడ్పీటీసీ కడిమి రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ రమేష్ మాట్లాడుతూ సర్వేశ్వరరావు మాస్టారు విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకి కృషిచేస్తూ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకోవటం గర్వకారణం అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ఉన్నతికి సర్వేశ్వరరావు చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు డి.సుబ్బారావు, చిన్నం ప్రశాంత్ కుమార్, సర్పంచ్ కొత్తపల్లి రజిని శ్రీనివాస్, ఎంపీటీసీ గంగులు కడియాలు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన పొగాకు పండించాలి



పొగాకు నారుమడిని పరిశీలిస్తున్న దామోదర్

జంగారెడ్డిగూడెం: రైతులందరూ బయో పెస్టిసైడ్స్ వాడి నాణ్యమైన పొగాకును పండించాలని పొగాకు బోర్డు ఎక్స్‌టెన్షన్ మేనేజర్ జి.దామోదర్ అన్నారు. బుధవారం జంగారెడ్డిగూడెం-1 వేలం కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ బయో పెస్టిసైడ్స్ వాడకం ద్వారా నాణ్యమైన పొగాకును ఉత్పత్తి చేయాలని సూచించారు. సీటీఆర్ఐ శాస్త్రవేత్తలు నిర్ధారించిన వంగడాలు మాత్రమే వినియోగించాలన్నారు. ప్రస్తుత ఏడాది వేలం ఆశాజనకంగా సాగడంతో రైతులు అధిక పంట పండించేందుకు ఆసక్తితో ఉన్నారని, అయితే బోర్డు సూచించిన మేర రాబోయే సీజన్‌కు బ్యారన్‌కు 35 క్వింటాల్ మాత్రమే పండించాలన్నారు. అనుమతికి మించి పొగాకు పండించినా, అనధికార బ్యారన్‌లు నిర్మించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పొగాకు రైతులకు బయో పెస్టిసైడ్ ట్రైకోడర్మా, సుడోమొనస్ మందులను దామోదర్ పంపిణీ చేశారు. పొగాకు నారు పెంచడానికి వాడే ట్రేల నాణ్యతను పరిశీలించారు. జంగారెడ్డిగూడెంలో మానికల నాగేశ్వరరావు వ్యవసాయ క్షేత్రంలో పొగాకు నారుమడులు పరిశీలించారు. కార్యక్రమంలో వేలం కేంద్రం అధికారి బి.శ్రీహరి, ఎస్‌జీవో కె.సుధీర్, రైతులు పాల్గొన్నారు.

అవినీతికి తావులేకుండా సంక్షేమ లబ్ధి

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- బొర్రంపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం

టి.నరసాపురం: అవినీతికి తావు లేకుండా సంక్షేమ లబ్ధి సొమ్మును నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. బుధవారం మండలంలోని బొర్రంపాలెం 1వ సచివాలయం పరిధిలో ఎంఆర్‌సీ కాలనీ, బీసీ ఏరియా, మెయిన్ రోడ్డులలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం ఆయా లబ్ధిదారులకు అందించిన సంక్షేమ పథకాల వివరాలను తెలియజేశారు. స్థానిక సమస్యలను అడిగి వాటి పరిష్కారానికి అధికారులకు సూచనలు జారీ చేస్తూ ముందుకు సాగారు. ఇటీవల సాంకేతిక లోపం కారణంగా ఎంఆర్‌సీ కాలనీలో స్థానికులకు రేషన్ బియ్యం నాలుగైదు నెలలుగా సరిగా పంపిణీ కావడం లేదని స్థానికులు ఎమ్మెల్యే బాలరాజు దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆయన స్పందించి తహసీల్దార్, ఆర్డీవో, జిల్లా పౌరసరఫరాల అధికారులతో మాట్లాడి వెంటనే సమస్యను పరిష్కరించాలని సూచించారు. డ్రెయిన్‌లు, రోడ్లు అభివృద్ధి చేయాలని స్థానికులు కోరగా స్పందించిన బాలరాజు సచివాలయానికి ప్రభుత్వం కేటాయించిన రూ.20 లక్షల నిధులతో పాటు, మరో రూ.50 లక్షల నిధులను గ్రామాభివృద్ధికి కేటాయిస్తామని హామీ ఇచ్చారు.



బొర్రంపాలెంలో కొత్తగా మంజూరైన పింఛన్‌లను పంపిణీ చేస్తున్న బాలరాజు

కొత్త పింఛన్ల పంపిణీ

గ్రామంలో మంజూరైన 22 మంది లబ్ధిదారులకు కొత్త పింఛన్‌లను బుధవారం ఎమ్మెల్యే బాలరాజు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ లబ్ధి అందించే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఎప్పటికప్పుడు అర్హులైన కొత్త లబ్ధిదారులను ఎంపిక చేసి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు, ఎంపీపీ దారబోయిన లక్ష్మి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొత్త ప్రకాష్‌బాబు, రైల్వే బోర్డు మెంబర్ వంటిపల్లి వెంకటేశ్వరరావు, సహకార సంఘం చైర్మన్ పిన్నమనేని చక్రవర్తి, సర్పంచ్ కలపర్తి వెంకటేశ్వరమ్మ మునేశ్వరరావు, ఎంపీటీసీలు కలపర్తి సుజాత, బండి సుబ్బారావు, ఉప సర్పంచ్ కొనకళ్ల సత్తిబాబు, పార్టీ గ్రామ కన్వీనర్ కొనకళ్ల సర్వేశ్వరరావు, పల్లా రమేష్, తోట గంగాధర్, బోళ్ల రంగారావు, తేజ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



హైస్కూల్‌లో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

బుట్టాయగూడెం: విద్యార్థులకు చదువులతో పాటు క్రీడలు ఎంతో అవసరమని స్కూల్ గేమ్స్ ఎంపిక జిల్లా కోర్డినేటర్ డి.రాజేంద్రప్రసాద్, బుట్టాయగూడెం ఎంఈఓ -2 సీహెచ్ నరేంద్ర రాయ్ అన్నారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో బుధవారం మండల స్థాయి బాలుర స్కూల్ గేమ్స్‌లో క్రీడాకారుల ఎంపిక పోటీలు జరిగాయి. ఈ పోటీలను నరేంద్ర రాయ్‌తో పాటు పాఠశాల హెచ్‌ఎం ఈ.గంగాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే ఆరోగ్యంతో పాటు ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. గత రెండు రోజుల నుంచి బాలికలు, బాలురులకు వేరువేరుగా మండల స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ పోటీలో ఎంపికైన వారు నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కాగా బుట్టాయగూడెం హైస్కూల్‌లో జరిగిన పోటీలకు మండలంలోని 8 పాఠశాలల నుంచి 160 మంది విద్యార్థులు హాజరయ్యారు. స్కూల్ గేమ్స్ మండల కోఆర్డినేటర్ జే చిన్నూ తదితరులు పాల్గొన్నారు.

డ్రాప్‌అవుట్ విద్యార్థిని గుర్తింపు

బుట్టాయగూడెం: చదువు మధ్యలోనే మానేసి డ్రాప్‌అవుట్‌గా మిగిలిపోయిన విద్యార్థినిని తిరిగి పాఠశాలలో జెడ్పీటీసీ మొడియం రామతులసి బుధవారం చేర్పించారు. వివరాల ప్రకారం రెడ్డిగూడెంకు చెందిన కోవుల అక్షయ అనే కొండరెడ్డి బాలిక 6వ తరగతి చదువుతూ ఆ చదువును మధ్యలోనే ఆపివేసింది. అయితే ఇటీవల రాజానగరంలో బాల్యవివాహాల నిర్మూలనపై జరిగిన కార్యక్రమంలో అక్షయ చదువు మానేసి ఇంటి వద్దే ఉండటం గమనించారు. దీంతో ఆమె తల్లి లక్ష్మితో మాట్లాడి అక్షయను రాజానగరం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 7వ తరగతిలో చేర్పించినట్లు రామతులసి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంజా దుర్గమ్మ, సూపర్‌వైజర్ ఎంవీ సత్యవతి, కార్యదర్శి ఎం.వాణి, చంద్రమణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

కామవరపుకోట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల సంక్షేమం, వారి అభివృద్ధే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన లక్ష్యమని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. కొండగూడెం నుంచి బొర్రంపాలెం వెళ్లే రోడ్డులో, జంగా దగ్గర నుంచి కొండగూడెం వరకు రూ.20 లక్షల గ్రామ సచివాలయాల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. స్థానిక సీఎస్ఐ సంఘ కాపరి జాన్రాజ్ ఆధ్వర్యంలో సంఘస్తులు, ఎమ్మెల్యే ఎలీజా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక కొత్తపేటలో విద్యుత్ వైర్లు కిందకి వేలాడి ప్రమాదకరంగా ఉన్నాయని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన ఆయన విద్యుత్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేపట్టిన నాలుగేళ్లలో రాష్ట్ర ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలతో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. మండలంలో వీరిశెట్టిగూడెం, కామవరపుకోట, తడికలపూడి, ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల సమీపంలో, రామన్నపాలెం గ్రామాలలో అభివృద్ధి పనుల నిమిత్తం రూ.60 లక్షలతో సీసీ డ్రెయిన్లు, సీసీ రోడ్ల నిర్మాణ పనులు త్వరలో చేపడతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు మిడత రమేష్ బాబు, నానాది సాగర్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ పందు జగదీష్, జిల్లా గ్రీవెన్స్ సెల్ సభ్యులు డాక్టర్ రామకృష్ణ, మండల సచివాలయాలు కన్వీనర్ పందు ప్రసన్న, ఎంపీటీసీలు మేడంకి పద్మ, బొప్పన చైతన్యకుమార్, కోటగిరి కిషోర్ బాబు, వెర్రి శ్రీను, దేవరపల్లి రామ్మోహన్ రావు, నల్లూరి ప్రభాకర్‌రావు, చిలుకూరు సుబ్బారావు, అయితం మహేష్, బండారు ప్రసాద్, మల్లెల్లి బాలస్వామి, ఉద్దండ శ్రీనివాసరావు, గుర్రాల రవి, బోట్ల లక్ష్మణ్, చింతపల్లి సుధా తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం అనంతరం ప్రార్థనలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా, సంఘస్తులు

సమష్టిగా గ్రామాల అభివృద్ధికి కృషి చేద్దాం

సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ వెంకటలక్ష్మి

లింగపాలెం: ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా గ్రామాల అభివృద్ధికి కృషి చేద్దామని ఎంపీపీ ముసునూరి వెంకటలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ వెంకటలక్ష్మి మాట్లాడుతూ మండల పురోభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉండవద్దని, మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. తహసీల్దార్ మురళీకృష్ణ మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న రైతుల సాగుభూమల రీసర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఇప్పటికీ ఈ సర్వే నాలుగు గ్రామాల్లో పూర్తయిందని తెలిపారు. ఏఓ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతి రైతు సాగు చేసిన పైరును ఈక్రాపులో నమోదు చేసుకోవాలన్నారు. రంగాపురం ట్రాన్స్‌కో ఏఈ పని తీరుపై వైస్ ఎంపీపీ మట్టా సురేష్, లింగపాలెం ఎంపీటీసీ బి స్వరూప ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం ఏలూరు నుంచి రంగాపురం డైలీ సర్వీస్ చేస్తూ విధులు నిర్వహించడం వల్లన రైతులు, గృహవినియోగదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారని చెప్పారు. ప్రైవేట్ లేఅవుట్‌ల్లో స్థానిక పంచాయతీ వారి అనుమతులు లేకుండా చేతివాటం ప్రదర్శిస్తూ సర్వీసులు మంజూరుచేస్తున్నారని వైస్ ఎంపీపీ ధ్వజమెత్తారు. ప్రజల నుంచి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని ట్రాన్స్‌కో ఏఈపై మండిపడ్డారు. మండల స్థాయి అధికారులు స్పందన కార్యక్రమానికి, మండల సర్వసభ్య సమావేశానికి తప్పక హాజరుకావాలని, గైర్హాజరైన అధికారులపై కలెక్టర్‌కు రిపోర్టు చేయనున్నట్లు ఎంపీడీవో ఎస్.ఆశీర్వాదం తెలిపారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ-2 కర్లపూడి జాన్సి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటలక్ష్మి

నిబంధనలు పాటించాలి



జయబాబు, ఎస్సై

కామవరపుకోట: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని చవితి పందిళ్ల వద్ద వినాయకుని విగ్రహాలు ఏర్పాటు చేసే వారు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తడికలపూడి ఎస్సై జయబాబు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సెంటర్లలో వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీస్ స్టేషన్లో అనుమతి తీసుకోవాలన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు నిబంధనలు పాటించడంతోపాటు ఐదుగురితో కూడిన కమిటీ, వారి గుర్తింపు కార్డులు, ఆధార్ కార్డు జిరాక్స్ అందజేసి అనుమతులు తీసుకోవాలన్నారు. ప్రతి కమిటీ వినాయకుని నిమజ్జన, ఊరేగింపు తేదీలను పోలీస్ వారికి తెలియజేయాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా కమిటీ వారే బాధ్యత వహించాలన్నారు.

అక్షరాస్యతకు కృషి



గిరిజనులకు పలకలు, పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: గిరిజన ప్రాంతంలో అక్షరాస్యత పెంపునకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నామని కొయ్యలగూడెం రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఐలూరి విశ్వనాథ శర్మ అన్నారు. బుట్టాయగూడెం మండలం మారుమూల గ్రామమైన ఉప్పరిల్లలో చదువురాని వారిని 20 మందిని గుర్తించి వారికి రోటరీక్లబ్ ఆధ్వర్యంలో బుధవారం పలకలు, పుస్తకాలను పంపిణీ చేశారు. చదువురాని గిరిజనులకు చదవడం, రాయడం నేర్పించేందుకు ఇద్దరు యువకులను వలంటీర్లుగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రోటరీక్లబ్ ప్రతినిధులు గొల్లిశెట్టి శ్రీనివాసరావు, అమీర్‌బాషా, మాటూరి రాధాకృష్ణ పాల్గొన్నారు.

మహిళపై దౌర్జన్యం కేసులో..

కొయ్యలగూడెం: మహిళపై దౌర్జన్యానికి పాల్పడిన నేపథ్యంలో నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జిజే విష్ణువర్ధన్ బుధవారం పేర్కొన్నారు. అచ్యుతాపురం గ్రామానికి చెందిన దండే జ్ఞానసుందరి వద్ద నుంచి అదే గ్రామానికి చెందిన కట్టురి చంటియ్య (చంటి) డబ్బులు అప్పుగా తీసుకున్నాడు. అప్పు చెల్లించమని అడిగితే ఇవ్వకపోగా తనపై దౌర్జన్యానికి పాల్పడినట్లు, ఇందుకు చంటితోపాటు మణిరత్నం, వినోద్, పెద్దబాబు సహకరించారని సుందరి ఫిర్యాదు చేసింది

ఇద్దరిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: యువకుడిని కొట్టి గాయపర్చిన నేరంపై ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం ఈడ్పుగంటి చందు త్రివేణీ కళాశాలలో బీకాం ఆఖరి సంవత్సరం చదువుతున్నాడు. ఇతనికి బట్టు సంజయ్ కుమార్తెతో పరిచయం ఉంది. ఈ నేపథ్యంలో ఈనెల 11న సాయంత్రం సుమారు 7.30 గంటల సమయంలో వీరిద్దరూ విద్యా వికాస్ గరల్స్ హాస్టల్ వద్ద కలిసి మాట్లాడుకుంటున్నారు. ఆ సమయంలో బట్టు సంజయ్, మరో వ్యక్తి చందుపై కర్రలతో దాడి చేసి గాయపర్చడంతో అతను ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

ఒక మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం శ్రీనివాసపురం గ్రామానికి చెందిన యడ్లపల్లి కుమారి, ఆమె భర్త రాజు గొడవపడడంతో వీరి కుమారుడు ఉదయ్‌కుమార్ వారికి సర్దిచెప్పాడు. అయితే గొడవ వల్ల మనస్థాపానికి గురై కుమారి ఈ నెల 10వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఉదయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

కొనసాగుతున్న గిరిజన యువత ఆందోళన

కొయ్యలగూడెం: స్వచ్ఛంద సంస్థలో ఉద్యోగాల తొలగింపు, మానసిక వేధింపులపై గిరిజన యువత చేపట్టిన ఆందోళన బుధవారంతో ఆరవ రోజుకు చేరుకుంది. తొలగింపబడిన ఉద్యోగులను తిరిగి సంస్థలో చేర్చుకోవడంతోపాటు సంస్థ సభ్యులకు బాకీ పడిన సొమ్మును జమ చేయాలని డిమాండ్ చేశారు. ఆరు రోజులుగా ఆందోళన ధర్నా కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ సంస్థ సభ్యులు స్పందించలేదని, ఐటీడీఏ పీవో వెంటనే కలగజేసుకుని నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగులు ఎం.రమాదేవి, ఎస్.రమాదేవి, కె.లలిత, ఎంవీజె కుమారి, జి.నాగరాణి, బి.సీత, బి.రేణుక పాల్గొనగా, గిరిజన నాయకులు పోలోజు నాగేశ్వరరావు, కె.శ్రీను, కె.పృథ్వీరాజ్, కె.శ్రీనివాస్, కె.కనకారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో...



శ్రీవారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఏలూరు జెడ్పీ చైర్మన్ పద్మశ్రీ, ప్రసాదరావు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని ఏలూరు జిల్లా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, ప్రసాదరావు దంపతులు బుధవారం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన వారికి స్థానిక జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, సర్పంచ్ కుంటం స్వర్ణలత, శ్రీవారి దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యుడు మానుకొండ సుబ్బారావు, వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి నాగేశ్వరరావు పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు వారికి వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు స్వామివారి మొమెంటోను, ప్రసాదాలను అందజేశారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ. లక్ష విరాళం

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు బుధవారం రూ.1,00,011 విరాళంగా అందజేశారు. ఏలూరుకు చెందిన అత్తులూరి రవికుమార్ దంపతులు ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. దాత దంపతులకు ఆలయ సూపరింటెండెంట్ గోపీనాథ్ విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



కొయ్యలగూడెం తూర్పు పేటలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: పర్యావరణానికి ప్రాముఖ్యత నిచ్చేలా వేడుకలు నిర్వహించుకోవడం ప్రజలు అలవర్చుకోవాలి అని పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మేకల అన్నవరం పేర్కొన్నారు. తూర్పుపేట రామాలయం వద్ద బుధవారం సాయంత్రం వినాయక చవితిని పురస్కరించుకొని మట్టి వినాయకుల విగ్రహాలను పంపిణీ చేశారు. స్వర్గీయ పోతన శేషగిరిరావు జ్ఞాపకార్థం కుమారుడు గణేష్ రాయుడు 520 మట్టి విగ్రహాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచుల చాంబర్ మండల అధ్యక్షుడు ఏలేటి చిన్న తుక్కయ్య, బోడిగూడెం సర్పంచ్ కడకట్ల గడ్డయ్య, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు దూలపల్లి కాంతారావు, చిడిపి రవి ప్రసంగించారు. రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అసోసియేషన్ అధ్యక్షుడు కరోతి నారాయణరావు, బెల్లాన శ్రీను, రౌతు శ్రీను, మారిశెట్టి శ్రీను, చిటికెన నాగార్జున, అవుటుపల్లి సతీష్, కోన దయారాజు, ఏలేటి భాస్కర్ పాల్గొన్నారు.

బాలరాజు పరామర్శ

టి.నరసాపురం: ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకుడు మొరవనేని గోపాలరావును బుధవారం బొర్రంపాలెంలో ఎమ్మెల్యే బాలరాజు పరామర్శించారు. ఈ సందర్భంగా గోపాలరావు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యానారాయణరాజు, రైల్వే బోర్డు మెంబర్ వంటిపల్లి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

కామవరపుకోట: తూర్పుయడవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును జిల్లా విజిలెన్స్ కమిటీ డైరెక్టర్ డాక్టర్ వంటిపల్లి విజయకృష్ణ బుధవారం పరిశీలించారు. తొలుత మధ్యాహ్న భోజన పథకాన్ని వినియోగించుకుంటున్న విద్యార్థుల సంఖ్య తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంటశాల వసతులు, నీటి లభ్యత, ఆహార నాణ్యత, రుచి, మెనూ అమలు, పరిశుభ్రత తదితర అంశాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఏ ఇబ్బందులు ఉన్నా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు విజయకృష్ణ సూచించారు.

అర్హతే ప్రామాణికంగా నూతన పింఛన్ల మంజూరు

లింగపాలెం: లింగపాలెం మండలానికి సెప్టెంబర్ నెలలో 472 కొత్త పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ ఎస్ ఆశీర్వాదం తెలిపారు. ఈ కొత్త పింఛన్లు బుధవారం నుంచి మండలంలోని అన్ని పంచాయతీల్లో ప్రజాప్రతినిధుల చేతులమీదుగా లబ్ధిదారులకు అందజేస్తారన్నారు. పుప్పాలవారిగూడెంలో సర్పంచ్ సుప్రియ చేతుల మీదగా లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుల, మత, రాజకీయ పార్టీలభేదం లేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేయడంతో లబ్ధిదారుల్లో సంతోషం వ్యక్తమవుతోందని అన్నారు. ఈ చిన్న గ్రామంలో అర్హత కల్గిన 19 మందికి నూతన పింఛన్లు మంజూరు కావడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మాజీ సొసైటీ అధ్యక్షుడు ఏపూరి సూరిబాబు, కార్యదర్శి అశోక్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసపురంలో 18 పింఛన్ల పంపిణీ

జంగారెడ్డిగూడెం రూరల్: శ్రీనివాసపురం గ్రామంలో కొత్తగా మంజూరైన 18 పింఛన్లను బుధవారం సచివాలయం వద్ద పంపిణీ చేశారు. జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ యడ్లపల్లి రాధిక, ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు చేతుల మీదుగా వితంతు, కల్లుగీత కార్మికుల పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ బాబ్జి, సర్పంచ్ రాధిక మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం పింఛన్లను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సిర్రా రాజేష్, పోల్నాటి రాజు, కట్టా బేబి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



చింతలపూడి : పాత చింతలపూడి సచివాలయం పరిధిలో నూతన పింఛన్లను అందచేస్తున్న దృశ్యం



జంగారెడ్డిగూడెం రూరల్ : శ్రీనివాసపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

పట్టిసీమలో 30 కొత్త పింఛన్ల మంజూరు

పోలవరం రూరల్: మండలంలోని పట్టిసీమ గ్రామంలో నూతన పింఛన్‌లను ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, సర్పంచ్ మైగాపుల విజయదుర్గ, ఎంపీటీసీ వలవల వరలక్ష్మి లబ్ధిదారులకు అందజేశారు. పంచాయతీకి 30 కొత్త పింఛన్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు మంజూరు చేయడమేగాక ఠంచన్‌గా ప్రతినెలా 1వ తేదీనే వలంటీర్ల ద్వారా లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రంబ వాసు, వైఎస్సార్ సీపీ నాయకులు మైగాపుల దుర్గాప్రసాద్, వలవల బాలాజీ పాల్గొన్నారు.

కామవరపుకోట: మండలంలో కామవరపుకోట మూడు సచివాలయాల పరిధిలో కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. వీటిని గ్రామ సర్పంచ్ మేదూరు రంగబాబు, ఎంపీటీసీలు బొల్లు వెంకట సత్యనారాయణ, తమ్మిశెట్టి గిరిజ, సొసైటీ చైర్మన్ సాయినా కనకరాజు బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. మొత్తం 45 పింఛన్లు మంజూరు కాగా వీటిల్లో 10 దివ్యాంగ పింఛన్లు, 16 వితంతు, 18, పింఛన్లు, 1 కల్లుగీత కార్మిక పింఛను ఉన్నాయి.

చింతలపూడి మండలంలో 615 పింఛన్ల మంజూరు

చింతలపూడి: మండలంలో కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ ముమ్మరంగా సాగుతోంది. మండలంలో కొత్తగా 615 పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ మురళీకృష్ణ తెలిపారు. పాత చింతలపూడి సచివాలయం పరిధిలో మంజూరైన పింఛన్లను మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎం ఇమ్మానియేలు, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ ఎస్.కాంతారావు బుధవారం లబ్ధిదారులకు అందచేశారు. ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందచేస్తుందని వారు తెలిపారు. ఎవరికైనా అందకపోతే సచివాలయంలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.